

# పోటిలో విజయము ఎవరిది ...?

Wanted నిమిషమునకు సుమారు 100 మాటలు షార్టుహేండు చేయువారు కావలెను. స్త్రీలైనను పురుషులైనను, పూర్వానుభవముతో ధరఖాస్తులను ఈ దిగువ యడ్రసుకు పంపకోరుచున్నాము. జయ కార్యాలయం, హైదరాబాదు.

"వాంటెడ్ కాలమ్" చూచి యెందుకైన దీనికి ఒక అప్లికేషను పంపిద్దామనుకున్నాను. ఇప్పటికి ఇలా అప్లికేషన్లుకి ఇంటర్వ్యూలకి తగలేసిన డబ్బుతో యేదైన చిన్న ఫేన్సీషాపుపెట్టుకున్నా యీ పాటికి కొంతవరకు డబ్బు చేసుకొందునేమో? అనిపించింది. వెంటనే అప్లికేషను పంపించాను.

ఫలితము...ఇంటర్వ్యూ వచ్చింది. సరే నాకుకూడ రాజధానిగా మారిన తరువాత హైదరాబాదు చూడాలని వుంది చాలకాలంనుంచి. ఇప్పటికైనా యీ విధముగా నెరవేరినందుకు సంతోషిస్తూ ప్రయాణమయ్యాను.

బస్సుస్టాండు చేరుకున్నాను. అప్పుడే బస్సువచ్చి స్టాండులో వుంది కండక్టరు పద్దకు వెళ్లి విజయనగరం ఒకటిక్కెట్టు యివ్వండి అన్నా! ఇంతలోనే పోటిలో పాల్గొనినట్లు విజయనగరం ఒక టిక్కెట్టు యివ్వండి! అంది, ఒక కోకిల కంఠం! ప్రక్క తిరిగిచూసా! 20, 21 సంవత్సరాలుంటాయి. చిలుకపచ్చ జార్జెట్టు సిల్కుచీర, నైలానుజాకెట్టులో పచ్చని దేహము. కాళ్లకు నల్లటిముఖామల్ స్లిప్పర్సు, హేండుబాగ్, మొత్తం పైని కట్టుబొట్టుచూస్తె గ్రాడ్యుయేట్ లా కన్పిస్తూంది! మళ్లీ కండక్టరువైపు తిరిగిచూచాను, అతనుకూడ ఆమె వైపే చూస్తూన్నాడు......కండక్టరు! టిక్కెట్టు అన్నాను. ఉలిక్కిపడ్డాడు! కండక్టరు. "విలాగండీ ఒకే ఒక ఖాళీవుంది మీ రిద్దరు అడుగుతున్నారు. అన్నాడు" యింకో అరగంటకల్లా రెండవబండి వస్తుంది. ఆమె ఆడపిల్ల మీ రెలాగయిన చేరుకోగలరు. అని బ్రతిమాలుతూ! ఆమెకు టిక్కెట్టు వ్రాసిచ్చాడు. దానితో పరీక్ష ఫలితాలు చూచి తప్పిపోయిన ముఖములా తయారైంది. హీనస్వరముతో, ఏయ్, కండక్టర్ యేమిటిది? అన్నా" బాబ్బాబు మరేం అనుకోకండి. ఇంకొక్క అరగంటలోనే వస్తుంది! రెండవబస్సు అని రైట్ చెప్పాడు.


రచయిత :
బృందావన్ పట్నాయిక్


ఎలా అయితేనేం! రెండవబస్సులో విజయనగరం చేరుకున్నాను. స్టాండు నుండి రిక్షామీద రైల్వేస్టేషనుకువెళ్లాను.

యింకా ట్రైను వచ్చుటకు 1 గంట పడుతుంది. మరేం వుబుసుపోవటం లేదు. ఏదైన పత్రిక కొందామని బుక్ స్టాల్ కు వెళ్లాను. చిత్రగుప్త వుందా? అన్నా. ఒక్కటే వుంది! అన్నాడు షాపువాడు. పర్సుతీసా, చిల్లరలేదు. ఐదు రూపాయల చిల్లరవుందా? అన్నా? ఏది! బాబు, యిప్పుడేకదూ! తెరచాము అన్నాడు. ఇంతలో నాతో బస్సువద్ద పోటీపడిన అమ్మాయి, ముసి ముసి నవ్వులతో వచ్చి, ఆ ఒక్క చిత్రగుప్తా డబ్బులిచ్చి తీసుకుంటూ రెండవ బస్సులో వచ్చారా? అంది! వెక్కిరించినట్లు. చేసేదేమిలేక! ఆ అన్నాను. రెక్క వాలింది! ట్రైయిను వచ్చేసింది. హైదరాబాదు టిక్కట్టు తీసుకొని పంట్లాం జేబులో వుంచాను. బండంతా రద్దీగావుంది. ఎలాగో వీలుచూచుకొని కంపార్టుమెంటు ఎక్కాను. సర్దుకొని కూర్చొనేసరికి నన్ను వెంబడిస్తున్నట్లు, ఆ లేడికన్నుల పూబోడికూడ కంపార్టుమెంటు ఎక్కింది. ఇదేమిటి! ఈమె నివురుగప్పిన నిప్పుకాదుగదా! డిటెక్టివులా! నా వెంబడి అనుసరించి నా ప్రవర్తన పరీక్షిస్తుందా! ఏమి? అయినా నన్నేమి చేయగలదు! అనుకొని ఆమె వైపు చూచా.

మసిలో మాణిక్యంలా మెఱుస్తూంది. కోతిచేతిలో పూలమాలలా! నలిగిపోతుంది. రాపులు తోపులాటలో ఆమె చెక్కిళ్లు ముదురు గులాబిరంగుగా మారాయి ముంగురులుపై స్వేదబిందువులు ముత్యాలులా మెఱుస్తున్నాయి! నయనాలు కొద్దిగా చికాకు కనబరుస్తున్నావి. గాని ఆమెబాధ ఎవరు గుర్తించినట్లు లేదు. ఎవరి గొడవల్లో వారు మునిగి తేలుతున్నారు.

పాపం స్థలం లేనట్టుగావుంది! అలా యెంత సేపని నిలబడతారు. యెక్కడైన చోటుచేసుకొని యిరుక్కోండి అని అన్నా! గర్వంగా! "ఫర్వాలేదులెండి! పక్కస్టేషనులో సర్దుకుంటా"నని సగర్వంగా చిరునవ్వు చిందించింది. చింత చచ్చినా పులుపు చావలేదనుకున్నా! మనస్సులో.

రైలుబండి రయ్ రయ్ మంటు చక చక పరుగెడుతుంది. స్టేషన్లు దాటి పోతున్నాయి. చెట్లు చేమలు, కొండలు,

వంతెనలు వెనక్కి పోతున్నాయి. మధ్య అమెకేసి చూసేసరికి, నావైపు అంత వరకు అమె చూస్తున్నదల్లా చటుక్కున పుస్తకములోకి మరల్చింది తనదృష్టి. ఎవరీమె? ఎక్కడకు వెళ్తూంది?

టిక్కట్టు ప్లీజు! అనే పురుములాటి మాటతో తేరుకున్నా! యేమిటి? టిక్కెట్టు లేకుండ ప్రయాణము చేస్తున్నవాడిలా! అంత గట్టిగా అడుగుతున్నాడనుకొని, టిక్కెట్టు మొహాన కొట్టేస్తె సరి! అని సీరియస్సుగా జేబులోకి చెయ్యిపోనిచ్చా! నిలువునా నీరైపోయాను. యింటర్వ్యూ కార్డు, రైలు టిక్కెట్టు, డబ్బుతోసహా పర్సు జేబులో లేదు. కంగారెత్తి జేబులన్ని వెతికా! ప్రయోజనం శూన్యమైంది. వళ్ళంత చెమటెక్కింది. యేం చెయ్యాలో తోచక కొయ్యబారిపోయాను. అఖరికి యెలాగో? తేరుకొని సార్! నా డబ్బు యెవరో !!!... అనేలోగా "కొట్టేశారంటావ్! అంతేనా? యేం? యీ దొంగవేషాలు నాదగ్గర సాగవ్. నీలాంటి సూటుగాళ్ళని ఎంతోమందిని పట్టిచ్చా. వేగంగా టిక్కెట్ చూపకపోతే ప్రక్కస్టేషనులో నీపనిచూస్తా" అంటు తక్కినవారిని టిక్కెట్టు అడుగుతున్నాడు నా పరిస్థితి అవమానము! దానికి తోడు నా పోటిదారు నన్ను చూచి, చిన్న మంద హాసము చేస్తూంది దానిని చూచేసరికి నిలువునా పాతాళానికి పోవాలనిపించింది. యేదైన బ్రహ్మ యివాల్టికి యిలా రాసేడేం అనుకొని రాబోయే ఆపదకోసం ఎదురుచూస్తున్నా! T. C. ఆమెవద్దకు వెళ్ళాడు అమె టిక్కెట్టు చూపింది. నాదగ్గరకు రావటంకోసం తిరిగేడు! ఇందలో "సార్!" ఆమె T. C. ని పిలిచింది. "ఏం! అంటూ అటుతిరిగాడు T. C.

ఇదిగోండి! ఈ పర్సు బుకింగ్‌రూము వద్ద దొరికింది. యెవరిదో యిందులో P. దుర్గాప్రసాద్, బి. ఎ., అని వుంది స్టేషనులో అప్పచెప్పాలనుకున్నాను. కాని అప్పటికే బండి కదుల్తూండటం వలన, ఆ పని వెంటనే చెయ్యాలేక పోయాను. T. C. గారు వచ్చేటప్పుడు యిచ్చివేద్దామని వుంచా! అది బహుశా! వారిదై యుండవచ్చు అంటూ (నన్ను చూపుతు తన హేండుబేగునుండి ఒక పర్సు-ఒకపర్సేం ఖర్మ-నాచేతికిచ్చింది. నాకు అది చూసేసరికి ప్రాణం లేచి వచ్చింది. మీ పేరేమిటండి అన్నాడు. P. దుర్గాప్రసాదండి! ఆ పర్సు నాదేనండి. అన్నా!" దానికి ఋజువేమిటండి? అప్పుడు నా సర్టిఫికేట్సు చూపించి జైలునుండి విడుదలబడిన ఖైదీలా బయటపడ్డాను. అమెకి Thanks ఎలా చెప్పాలో అర్థంకాక "Very Many thanks" తో సరిపెట్టాను.

హైదరాబాదులో దిగి నేరుగా నేను యింటర్వ్యూ అఫీసుకు పోయాను. అమెమాత్రం బంధువులయింటికేగింది. యింటర్వ్యూలో నాతో ఆమె పోటిగా నిలబడింది. యింటర్వ్యూ జరిగిపోయింది. హైదరాబాదు ఒక్కసారి చూచి గుడ్-బై-కొట్టి యింటికి వచ్చా!

మా నాన్నగారు నన్ను పిలిచి "నాయనా! నీ యింటర్వ్యూ ఏమైంది. నిన్నమొన్న మన ప్రక్కగ్రామములో నున్న నరసింహమూర్తి యింటికెళ్ళాను అతని కుమార్తె బి. ఎ. చదివిందట. పేరు సుశీల. లక్షణంగావుంది. ఆమె యిప్పుడు వుద్యోగ ప్రయత్నములో వుందట. పెళ్ళయిన తరువాత వుద్యోగములో వుంచుతావో! యింట్లో వుంచుతావో! నీయిష్టం!" అని గ్రుక్క తిప్పకుండా అన్నారు. ఆ తరువాత మాట ఇచ్చేశాననీ! ముహూర్తంకూడ పెట్టించాననీ! చల్లగా చెబితే- మాట్లాడకుండా, అంగీకారం తెల్పవలసివచ్చింది. ఒక మూల పిల్లరూపురేఖలను చూడకుండా ఎలాచేసుకోను అని బాధగా ఉన్నా— నాన్నగారి మాటకి ఎదురుచెప్పటానికి గాని, నా సందేహము బయటపెట్టడానికి గాని బిడియం. భయం ఒక్కసారి కలిగాయి నేను ఊఁ. అనక తప్పిందికాదు.

పెండ్లిపందిరి మహా వైభవముగా అలంకరింపబడింది. పెండ్లిపందిరి పేరంటాళ్ల రంగు, రంగుల శీతాకోక చిలకలతో రమణీయంగా వుంది. ఒక ప్రక్క దైవజ్ఞులు అసీనులై పెండ్లి తంతును గమనిస్తున్నారు, బ్రాహ్మలు మంత్రాలు పఠిస్తున్నారు, మంగళవాయిద్యాలు విన సొంపుగా వినవస్తున్నవి. పెండ్లికూతురు మెడలో ఆ మూడు ముల్లు వేసాను

శోభనపుగది వింతవింత రంగులతో అలంకరింపబడింది. సుగంధ మారుతములు మనస్సును మరిపిస్తున్నవి. సిపాను చీరలో సిగ్గుతో చిక్కిపోయిన పెండ్లికుమార్తెను ముత్తయిదువులంతా అనునయ వచనాలతో బలవంతముగా గదిలోకి నెట్టారు అమె ఎవరోకాదు యింటర్వ్యూలో పోటిపడిన సుశీల!

నాలుగు నేత్రాలు కలిసాయి! అమె కలువకన్నులు త్రుళ్లిపడ్డాయి! వింత భయకంపితాలతో దిక్కుతోచక ఆ మృగేక్షణ నిలబడింది. పోటిలో విజయమెవరిదీ అన్న సమస్య మా యిద్దరిని ఎదుర్కొన్నది.

